వోల్ఫ్‌గాంగ్ హిల్డె షీమర్

# 8. స్టూడియోలో జల్సా

నా గదులను అనుకుని ఉన్న స్టూడియోలో కొంతకాలంగా అల్లరిగా జల్సా సాగుతోంది. నేను దానికి అలవాటుపడి పోవడంవల్ల ఆ రొద నన్ను సాధారణంగా అట్టేబాధించడం లేదు. కాని ఉన్నట్టుండి అది తారస్థాయి యయినందువల్ల నేను ఇంటి కామందుకు ఫిర్యాదు చెయ్యవలసి వొస్తోంది. ఫిర్యాదులు చేయగా చేయగా ఒక సాయంకాలం ఆయన ఈ అల్లరి గురించి స్వయంగా విచారించ డానికని వచ్చాడు. కాని సరిగా ఆ సమయానికి అల్లరి కాస్తా సద్దుమణగడమూ, ఆయన నా ఫిర్యాదును నిరాధారమని కొట్టిపారెయ్యడమూ జరిగింది. కళ్ళారా చూస్తే నైనా పరిస్థితి ఎంత దుర్భరంగా ఉన్నదీ ఆయనకు తెలిసివస్తుందని నేను ఆశపడ్డాను. అందుచేత బట్టల అలమారు తెరిచి, దాని వెనకఉన్న కంతలోనుంచి అవతల సాగే జల్సా చూడనిచ్చాను. ఏమంటే, బట్టల అలమారు వెనక ఉండే గోడలో బాగా మనిషి దూరేపాటి కంత ఉన్నది. ఇల్లు గలాయన ఆ కంతలో నుంచి కాస్సేపు చూసి, అలమారులోనుంచి ఇవతలికి వచ్చి, సమ్మతి సూచకంగా "ఊఁ" అని మాత్రం అని, వెళ్ళిపోయాడు. మరికొన్ని గంటల అనంతరం — అంటే రొద తిరిగి తారస్థాయి నందుకొన్నప్పుడు — నేనా కంతగుండా చూద్దును గదా, ఇల్లు గలాయన కూడా జల్సాలో మునిగితేలుతూ కనిపించాడు.

సంగతేమిటంటే, నేనీ గదులుండే ఫ్లాట్ ఆక్రమించి ఇప్పటికి చాలాకాల మయింది. కాని నేను ఆక్రమించడంచేత ఇది అట్టే మారినట్టు లేదు. నివసించే వాడి స్వభావం వాతావరణానికి అనుగుణంగా ఉంటుంది, అందుచేత నే నేదైనా

ఆఫీసులాటి చోటికి మారదామనుకుంటాను. అయితే ఇది ఆచరణలో పెడదామను కున్నప్పుడల్లా మనోదార్ఢ్యం చాలక మానేస్తూ ఉంటాను.

ఇప్పుడు కంతలోనుంచి చూడటం చాలా తగ్గించేశాను. అవతల ఉండే మనుష్యబృందంలో మార్పులు గమనిస్తున్నాను. ఆరంభంలో ఉండిన అతిథులు కొందరిప్పుడు లేరు. వాళ్ళకు బదులు ఇతరులు వచ్చారు. కొందరు జములుగా అయినట్టుకూడా కనిపిస్తున్నారు. ఉదాహరణకు బెన్‌రాత్ అనే కవి ఎప్పుడు చూసినా ఒకేసారి రెండుచోట్ల కనబడుతున్నట్టు నాకు భావన కలుగుతోంది; విడ్డూరాలూ, స్వయంప్రేరితాలూ అయిన దృగ్భ్రమ ! గెర్డె స్ట్రోయెర్ తన జుట్టుకు రంగు వేసుకున్నదని గ్రహించాను–అవి ఒకప్పుడు నా రంగులే అయి ఉంటాయి. హోల్డార్ఫ్ యువతిని గుర్తించాను. నేను కిందటిసారి, ఎనిమిదేళ్ళనాడు, ఆవిణ్ణి మేరీ స్టువర్టు పాత్ర ధరించగా చూశాను (అన్నట్టు, అది మరవరాని సంగతి) ఫ్రౌ ఫాన్ హెర్గెన్ రాత్ వెళ్ళిపోయింది–ఈ మధ్యకాలంలో చచ్చిపోలేదు గద ? కాని ఆ అద్దాలు వేసేవాడున్నాడు, ఇంతకాలమూ ఉంటూనే ఉన్నాడు.

నేను కలతగా లివింగ్ రూములో పచార్లు చెయ్యసాగాను. కాని అందుకు కూడా సామాను అడ్డమే. అది అడ్డదిడ్డంగా ఉన్నది. చైనా కాబినెట్ కాస్త కదిలితే చాలు లోపల ఉన్న పలకల గ్లాసు వొస్తువులు గలగల్లాడతాయి. టేకుబల్ల కాళ్ళ కింద ఎన్ని సిగరెట్టు పెట్టెలు దోపినా అది ఆడుతూనే ఉంటుంది. సన్నటి కాడ గల పూలకుండీ చీటికీ మాటికీ పడిపోతూ ఉంటుంది. అదే దాని పని అయినట్టు. చిట్టచివరకు నేను వెళ్ళి పికాసో చిత్రించిన 'నీలి యువకుడు' ముందు నిలబడ్డాను. ఎంత బాగుంది, అసలుకు ఎంత చక్కని నకళ్ళు అచ్చేస్తున్నారు! ఆధునిక సాంకేతిక నైపుణ్యం ఎంత విశిష్టంగా వుంది ! అనుకున్నాడు. ఇలాంటి ఆందోళనకరమైన సంఘటనలు జరిగినప్పుడు నా ఆలోచనలను పెడమార్గం పట్టించడానికి ఇలాంటి పద్ధతులే అవలంబిస్తాను. పూర్తి మనస్థిమితం కలగక పోయినా, కొంత ఉపశాంతి లభిస్తుంది. రిఫ్రిజెరేటరు వద్దకు వెళ్ళి, చల్లని పెపర్ మింట్ టీ ఒక గ్లాసు సేవిస్తాను. ఇలాంటి సందర్భాలకు మహామంచి పానీయం. ఒక్కొక్క గుక్కె తాగుతున్న కొద్దీ నా ఆగ్రహం అదుపులోకి వచ్చినట్టు స్పష్టంగా తెలిసిపోతుంది. అటు తరవాత సాధారణంగా పేషన్స్ ఆడు కుంటాను.

"లాండ్‌స్కేప్ పేంటర్ లీనర్టానీడర్ తెలుసునా ? నే నతనిలాగే పేంట్ చేస్తాను.''

ఆ లాండ్ స్కేప్ పేంటర్ నాకు తెలీదన్నాను. అద్దాలు వేసేవాడు వెళ్ళిపోయినదాకా పని వాయిదా వేయడానికి తీర్మానించుకున్నాను. నాకు ఇన్‌స్పిరేషన్ సున్నితత్వం బాగా తెలుసు. నా చిరాకును అదుపులో ఉంచకపోయానో నేను వేయదలచిన బొమ్మయొక్క స్వరూపంకాస్తా చెదిరి చక్కాపోతుంది. ఆమ్ చేర్‌లో కూర్చుని, సిగిరెట్టు వెలిగించి, నేను చెయ్యదలచిన సృష్టిని నింపాదిగా, దానికి ఘాత కలగకుండా అతి నింపాదిగా పక్కకు నెట్టేశాను.

కాని అద్దాలు వేసేవాడు పని ముగించే లోపునే ఫ్రౌ ఫాన్ హెగ్గెన్‌రాత్ వచ్చేసింది. నేను నా నెట్టుడు పని మానేసి, ఒక్క నిట్టూర్పు విడిచి, కాగల దానికి ఒడిగట్టుకున్నాను. శాంతంగా ఉండడం ఎంతైనా అవసరం; ఆవిడ చాలా డబ్బు గలది, ఆవిడ ఆదరం మీదనే నా జీవితనౌక చాలావరకు నడుస్తోంది. భుక్తి తరవాతనే కళ, ఏ పామరుణ్ని అడిగినా ఈ మాట ఒకటికి పదిసార్లు సంతోషంగా చెబుతాడు. ప్రమాణం చేస్తాడు.

"పని ఎలా సాగుతున్నదీ చూతామని వచ్చాను," అన్నదా ధర్మాత్మురాలు, నా కోసం బొమ్మల మధ్య వెతుకుతున్న దానిలాగా చుట్టూ కలయజూస్తూ. "నీ కాస్టే పని లేకుండా ఉన్నట్టు విన్నాను."

ఆ అపరాహ్ణం, స్టూడియో ఇంకా నా అధీనంలోనే ఉన్నప్పుడు, ఆ మనిషి అక్కడే ఉన్నాడు. చాలాకాలం చేతులుకట్టుకు కూర్చుని, ఆ పూటే పేంటింగు మొదలుపెడదా మనుకున్నాడు. పగిలిపోయిన కిటికీ అద్దాలు తీసి కొత్తవి వెయ్యడానికి వచ్చి, తాపీగా సుత్తెతో కొట్టుకుపోతున్నాడు. నా భార్య పక్క గదిలో పడుకుని నిద్రపోతున్నది. బయట వాన కురుస్తున్నది. అప్పటి నా మనస్థితి నా కింకాబాగా జ్ఞాపకం. ఎన్నో వారాలపాటు అన్వేషించగా, అన్వేషించగా ఇన్‌స్పిరేషను అందుకున్నది. నేను ఎంతో తృప్తిగా రంగులు కలుపుతూ, ఆయిల్‌పేంట్ల ఘాటు ఆఘ్రాణిస్తున్నాను.

అద్దాలవాడు తాపీగా, పట్టుదలగా అద్దాలు వేస్తున్నాడు. అతను నన్ను బాధించడు. కనీసం అలా అనుకున్నాను. కాని నేను కాన్వాసును స్టాండు మీది కెక్కించగానే, "నేనూ పేంట్ చేస్తాను," అన్నాడు.

"ఓహో ?" అన్నాను. నిజమా అని అన్నానేమోకూడానూ.

ఏమైనా నేను ముక్తసరిగానే మాట్లాడాను.

అరెసు రెట్టించిన ఉత్సాహంతో, "అవును. వాటర్ కలర్స్‌లో పర్వత దృశ్యాలు వేస్తాను. అయితే ఇలా ఆధునికంగా కాదు. వీటిని ఎటు తిప్పి చూడాలో కూడా తెలీదు. కంటికి కనిపించేదే వేస్తాను," అన్నాడు.

అతని ధోరణిలో ఎమెచూర్లకు సహజమైన దర్పం ఉన్నది.

నా కళ నా కెలా గడ్డి పెట్టుతున్నదో ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్‌తో చర్చించాలన్న ఉద్దేశం నా కేకోశానా లేదు. అందుచేత నే నావిడతో నా కళాపాటవం మంచి ఊపులో ఉన్నదని తెలియబరచి, అందుకు తార్కాణంగా చుట్టూతా ఉన్న బొమ్మలను డాబుగా చూపాను. నిజాని కవి పాతవే, వాటినామె లోగడ చాలా సార్లు చూసింది కూడా. కాని ఆవిడకు జ్ఞాపకశక్తి తక్కువని నాకు తెలుసు. జరిగినది కూడా అంతే. ఆమె వాటిని గుర్తించక, కొత్తగా చూస్తున్నట్లు చూసి, ఆత్మపరంగా విమర్శించి, తాను లోగడ యిచ్చిన అభిప్రాయాలకు పూర్తిగా విరుద్ధమైన అభిప్రాయాలను కూడా కొన్నిసార్లు వెలిబుచ్చింది. అలాటప్పుడు సహజమే గనక, నేను ఇబ్బందిగా ఆమె చెప్పేది ఆలకించాను. కనీసం అద్దాలవాడి నోరు కట్టుపడింది. అతను మౌనంగా సుత్తెతో కొట్టసాగాడు. బయట వాన వెలిసిందని గమనించాను. కాలం నిలిచిపోయింది.

ఆ అపరాహ్ణపు ప్రశాంతతను ధ్వంసంచేస్తూ ఎంగెల్‌హార్ట్ అకస్మాత్తుగా గదిలోకి వచ్చిపడ్డాడు. ఎంగెల్‌హార్ట్ దుర్భరమైన సామాజికుడు, ఆతని ఉల్లాసం ప్రచండమైనది. కాని అతన్నిచూచి ఆగ్రహించరాదు, ఎందుచేతనంటే, కామంబెర్ జున్నులాగా, అతను పైకి జుగుప్సాకరంగా కనిపించినా లోపల చాలా మృదువైనవాడు. ఆ కారణంచేతనే కాలం గడిచేకొద్దీ అతను మరింత దుస్సహమనిపిస్తాడు. అచ్చగా అతనేకాదు కూడా ! ఏ క్షణాన అతను నన్ను భుజంమీద కొడతాడో అని భయపడి చస్తున్నాను. ఆతను ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్ చెయ్యి ముద్దుపెట్టుకుని, నాదగ్గరికి చప్పున వచ్చి భుజంతట్టే పని ముగించాడు, "ఏమోయ్" అని గట్టిగా ఏదో అరుస్తూ. ఆ తరవాత, "ఈమధ్య కళ ఎలా ఉంటోంది ?" అని అడిగాడు.

"బాగానే ఉంటోంది," అన్నాను. అటువంటి ప్రశ్న ఎవరు వేసినా ఇంచుమించు ఒకేవిధంగా సమాధానమిస్తాను. సంగ్రహంగానూ, సమగ్రంగానూ కూడా

ఉండేలాగా సమాధానమిచ్చే దారి నాకు కనిపించలేదు. అది అంత అవసరం కాదు కూడా, ఏమంటే, అడిగేవాళ్ళు నే నిచ్చే ఎటూగాని సమాధానాలతో తృప్తిపడ్డట్టే కనబడేవారు.

ఆ మానవుడు, మరీ ఆరంభంలో వేసిన నీరసమైన బొమ్మలను చూస్తున్న ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్ పక్క చేరి, "కళామతల్లి ఆశ్లేషం విడలేదన్నమాట. అందుకు సెలిబ్రేషన్ అవసరం," అంటూ కోటుజేబులోనుంచి బ్రాందీబుడ్డి తీశాడు. అతని ఏకైక జీవితాశయం జల్సా, దాన్ని అతను అతిసునాయాసంగా సాధించేవాడు.

"మంచి నిపుణతగల పిండం, కాదూ?" అని అతను ఫ్రౌ ఫాన్ హెర్గెన్ రాత్‌తో అన్నాడు. నా గురించే అది. నేను గ్లాసులూ అవీ తేవడంలో నిమగ్నుణ్ణి కావడంచేత, ఈ మాటంటూ అతను తన అలవాటు ప్రకారం వేలితో ఆమె పక్క ఎముకల్లో పొడిచాడో లేదో గమనించలేదు.

ఈ సమయంలో నా భార్యకూడా వచ్చేసింది. అలారం కొడితే కూడా లేవదేమోగాని, దూరాన బిరడా తీసిన చప్పుడైతే చాలు ఆమె నిద్ర లేచేస్తుంది. ఆమె మత్తుగా వచ్చి మమ్మల్ని జంకుతూ పలకరించింది. ఆమె నన్ను తప్ప మరెవ్వరినీ గుర్తించలేదేమోనని నాకు అనిపించింది. అపరాహ్ణంవేళ నిద్రలేచాక ఆ మత్తు ఆమెకు ఒకంతట వదలదు. ఒకటి, రెండు గ్లాసులు బ్రాందీ లోపలికి పోయాక ఆమెకు ప్రపంచంతో ఎప్పటి సంబంధం ఏర్పడుతుంది. (అదికూడా ఒకసారి ఉన్నట్టు ఒకసారి ఉండదనుకోండి.) ఎంగెల్‌హార్ట్ ఆమెకు భారీ మోతాదు అందించాడు. తరవాత అతను ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్‌కు పొయ్యబొయ్యాడు, కాని ఆమె గ్లాసుకు చెయ్యి అడ్డంపెట్టి, ఆ వేళప్పుడు తనకు తాగే అలవాటు లేదన్నది. నిజానికిది నామీద విసురు. దాని అంతరార్థ మేమంటే, పట్టపగలు కళకు సంబంధించని చర్యలు జరిపేవాణ్ణి ఆదరించవచ్చునా అని. అయితే ఈ అంతరార్థం ఎంగెల్‌హార్ట్ గుర్తించలేదు. అతను తన చాకచక్య మంతా వినియోగించి ఒక బుల్లి అరగ్లాసు పుచ్చుకోవడానికి ఆమెను ఒప్పించాడు. దాంతో జాలు పడ్డది. ఆ తరవాత ఆమె మొహమాటం విసర్జించి చేపతాగిన ట్టంటారే, అలా తాగనారంభించింది.

ప్రారబ్ధం, ఎంగెల్‌హార్ట్ అద్దాలవాడికి ఒక చుక్క పోస్తుంటే అడ్డుపడలేక పోయాను. అతను తన పని ఎప్పుడో ముగించి ఉండాలి, అయినా ఉత్తగా సుత్తె

ఆడిస్తూ వచ్చాడు. అతని కిక్కడ బాగున్నది. ఇప్పుడు, ఎంగెల్‌హార్ట్ ఆహ్వానించడమే ఆలస్యంగా బల్లదగ్గిరికి వచ్చి, "అభ్యంతరం లేదు," అంటూ సారా ఎత్తి పోసేసుకున్నాడు.

"నేను పేంట్ చేస్తానుకూడా," అన్నాడతను ఎంగెల్‌హార్ట్‌తో, తాను మా బృందంలో చేరిపోవడానికి అది సమర్థింపులాగా.

"పేంట్ చెయ్యనివా శ్శెవరు ?" అన్నాడు ఎంగెల్‌హార్ట్ మూఢుడిలాగా. ఈ మాట ఎలా అర్థంచేసుకోవాలో తెలీక అద్దాలవాడు నా భార్యతో కళగురించి ఏకపక్ష సంభాషణ ప్రారంభించాడు.

మే మలా కూర్చుని ఉండగా తలుపు తెరుచుకుని ఇద్దరు వ్యక్తులు — భార్యాభర్తలు కావొచ్చు—లోపలికి వచ్చారు. తాగుడు ఫలితంగా నా భార్య తన గృహస్థధర్మాన్ని ఏమరడంచేత నేను లేచి, ఆ పరిస్థితిలో నాకు చేతనైనంత ఆప్యాయంగా వారిద్దరికీ స్వాగతం తెలిపాను. మగవాడు తనను తాను పరిచయం చేసుకున్నాడు. అతనిపేరు నేను సరిగా వినలేదు. ఎవరి పరిచయం చేసుకునేటప్పుడైనా వాళ్ళపేరు వినడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉండలేను. పారిస్‌లో ఉండే హర్బర్ట్ శుభాకాంక్షలు పంపాడని అతను చెప్పాడు.

"ఓ, హర్బర్ట్ ?" అని తల ఆడించాను, నేను అతనితో గడిపిన రోజు లింకా నాకు గుర్తున్నట్టు. నిజానికి నే నా పేరు ఎన్నడూ వినలేదు. ఆ దంపతులను నా భార్యకూ, మిగతావాళ్ళకూ పరిచయం చేశాను. వాళ్ళపేరు నేను పట్టుకున్నమటుకు అస్పష్టంగా ఉచ్చరించి, హర్బర్ట్ శుభాకాంక్షలు గురించి గట్టిగా చెప్పాను. కాని ఆ పేరు ఎవరూ విన్నట్టు లేదు. నా భార్య మరిన్ని గ్లాసులు తెచ్చింది. ఎంగెల్‌హార్ట్ రెండో కోటుజేబులోనుంచి మరొకసీసా పైకి తీశాడు. ఈ లోపుగా దంపతులు వాతావరణానికి మచ్చిక అయారు.

ఎలా అయిందోగాని పరిస్థితి చెయ్యిదాటిపోయింది. అసలు ఆ అద్దాలవాణ్ణి చూస్తుంటే నాకు కంపరం పుట్టుకొచ్చింది, వాడు ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్ చెయ్యి మీద చెయ్యివేసి తాను కనిపించేదే చిత్రిస్తానని చెబుతున్నాడు. ఆమె వినిపించుకోకుండా తనలో తాను కూనిరాగం తీస్తున్నది. ఆమీదట నా కేదో గుబులులాటిది పట్టుకున్నది. నేను వేద్దామనుకున్న బొమ్మ స్వరూపం పూర్తిగా చిందరవందరై పోయింది. కళాదేవత ముఖానికి ముసుగువేసుకుని పలాయనం చేసింది—టర్పెంటైన్

వాసనమాత్రమే మిగిలింది. కొత్తవాళ్ళిద్దరికేసి చూచాను. ఇద్దరూ చుట్టలు కాలుస్తున్నారు. ఖుషీగా ఉన్నట్టు కనబడ్డారు. హర్బర్ట్ మార్ఫో వీధిలోకి మారాడనీ, అతని పాత దురలవాట్లేవీ పోలేదనీ ఆ ఆడమనిషి నా భార్యతో అంటున్నది, చెప్పేమనిషి ముఖాన్నిబట్టి చూస్తే ఆ అలవాట్లు చాల చెడ్డవై ఉండాలి — మాదక పదార్థాలేమో.

ఈలోపుగా ఎంగెల్‌హార్ట్ నిర్వాహకత్వం తనమీద వేసుకుని ఇంకా అనేకమందిని టెలిఫోను మీద ఆహ్వానించాడు. (అతని భాషలో అది జనాన్ని 'కొట్టుకురావడం'). మా ఇంట పార్టీ జరుగుతున్నదని అతను వారితో చెప్పాడు; అందరూ వాళ్ళ వాళ్ళ బంధుమిత్రాదులను వెంటబెట్టుకుని, సాధ్యమైనంత ఘాటైన సరుకు గల సీసాలతో మరీ రావలసినదిగా హెచ్చరించాడు. అద్దాలవాడు కూడా ఆ పనే చెయ్యబోతే నేను అతికష్టంమీద నివారించి, మంది మరీ జాస్తి అయితే సరదా కాస్తా పోతుందనీ, ఈ పార్టీకి సంభాషణే ప్రాణమనీ అన్నాను. చిత్రమేమంటే, అతను నే నన్నదానికి ఒప్పుకున్నాడు.

అందరికన్న ముందు వచ్చినది గెర్డా స్టోమెర్. ఆమె కటూఇటూ చెరొక వయసు మళ్ళినవాడూ ఉన్నారు. వాళ్ళిద్దరుకూడానున్నూ బహు నిర్దుష్టంగానూ, అమిత ఘరానాగానూ, పరిరక్షణ కోసమే పుట్టినట్టుగానూ ఉన్నారు. వాళ్ళు అమిత ఆశ్చర్యంతో కలయచూశారు, కాని తమ ఆడాలో ఉన్న చలాకీపిల్ల చంటిపిల్లల భాషలో నా భార్యను పలకరించినప్పుడు ఒకరి నొకరు చూసుకుని మందహాసం చేసి తమ ఆమోదాన్ని వ్యక్తం చేసుకున్నారు. ఈ విధంగా ప్రారంభమైన వారి 'పతనాన్ని' అద్దే శక్తి ప్రపంచంలో ఏదీ లేదు.

ఇక అతిథులు తూగిడీలుగా రా నారంభించారు. ఒక్కొక్క జట్టువెంటా ఒకటీ రెండూ సీసాలున్నాయి. వారిలో ఒకరిద్దరిని నేనెరుగుదును. ఉదాహరణకు, వేరా ఎర్బామ్ నా భార్యకు ప్రాణమిత్రమో, శత్రువో అవుతుంది. ఆవిడ అస్తమానమూ, నాకు దృష్టిపెట్టటం చూసి చూసి, ఒకనాడు, మా నాన్నకు డెబ్రిట్స్‌బర్గ్‌లో రొట్టెల ఫాక్టరీ ఉండేదని చెప్పాను. అదిమొదలు ఆమెకు నేనంటే ఏదో అనుమానం. అయినా ఇప్పుడామె ఒక యువకుణ్ణి వెంటబెట్టుకుని వచ్చింది. అతను కూడా కొద్దిగా నాకు తెలుసు. అతను అసెసరో, రిఫ్రెండరీయో, లేక రెండూ ఒకటేనో. అతన్ని చూస్తే ఎవరికో ప్రియుడనిపించేలాగున్నాడు, ఆమె

ప్రియుడేనేమో. వీళ్లుగాక పొల్లానీ అనే పేరు గల ఇద్దరు సినిమాస్టార్లున్నారు, ఎక్కడినుంచి ఊడిపడ్డారో తెలీదు. బహుశా అది వాళ్ళ అసలుపేరయి ఉండదు, వాళ్లు వాస్తవంగా భార్యాభర్తలు కూడా కాకపోవచ్చు. నేనొకప్పుడు ఆ భార్య చిత్రం చిత్రించాను. ఆ సందర్భంలో ఆమె రంగు అద్దాలు తీసేసింది. ఈలోపల అతిథిసత్కారాలు నిర్వహిస్తున్న ఎంగెల్‌హార్ట్ పొల్లానీ సతిని " డార్లింగ్ " అనడం నాకు వినపడింది. ఆ విధంగా అతను తాను సంచరించే జగత్తును మరింత విస్తృతం చేసుకున్నాడు.

ఇతర అతిథులను గురించి వివరించడం అనవసరం. అక్కడి వాతావరణం గురించి ఒక్కముక్కలో చెప్పెయ్యొచ్చు —చీకటి పడడానికింకా చాలా వ్యవధి ఉండగానే అతిథులంతా ఏకపాకమైపోయారు; స్పృహతో ఉన్న కొత్తవాళ్ళు వచ్చి ఆ పాకంలో చేరడమూ, మరుక్షణం తమ వ్యక్తిత్వాలను కోల్పోవడమూనూ.

నా సమీపంలోనే ఉన్న ఒక యువ చిత్రకారుడు, "స్టూడియో పార్టీ తప్ప జీవితంలో మరేమీ ఉండగూడదు " అనడం నా చెవిన పడింది.

"స్టూడియో పార్టీయే జీవితమంటే," అని అతని పక్కనే ఉన్న గడ్డంవాడు జవాబిచ్చాడు. అతనొక కళావిమర్శకుడు, చతురోక్తులకు పేరుమోసినవాడు. ఆ సాయంకాలం నేనతన్ని భోజనానికి రమ్మన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. పరిస్థితిలో కలిగిన మార్పుకు అతను సరిపెట్టుకున్నట్టు కనబడ్డాడు. అతను తన గ్లాసులోకి చూసి ఏదో ఆలోచిస్తూ మందహాసంచేస్తూ నిలబడి, తన కాలితో నేలమీద పడిఉన్న ష్మిట్ హోల్వెగ్ స్థూలకాయం మీద దరువు వేస్తున్నాడు. తప్పతాగి పడిఉన్న ఆ మనిషి ఒక శిల్పి, తన వృత్తిపట్ల గల ఏవగింపును గురించి తప్ప తాగిన బొంగురుగొంతుతో వ్యక్తంచేస్తూ వుండేవాడు. తాగిన మత్తులో రాబలే సృష్టించబడిన పాత్రాలాంటివాడు.

అర్ధరాత్రి కావస్తుండగా నన్ను గోడకేసి నొక్కేశారు. గోడ నా కెదురుగా ఉన్నది. నేను వెనక్కు తిరగడానికి గాని, నా బొమ్మలమీదనైనా చోటు చేసుకోవడానికి గాని అవకాశం లేకుండా తాగుబోతులు నా పక్కగా నృత్యం చేస్తూ నడుస్తున్నారు. ఈ దుర్భర పరిస్థితిలో నాకు నా పక్కనున్నవాడి జేబులో ఒక సుత్తె దొరికింది. వాడు అద్దాలవాడు. "ఇప్పుడే ఇస్తాను," అని కేక పెట్టాను. నిజానికి అప్పట్లో అలాటి మర్యాద బొత్తిగా నిరర్థకం, ఎందుచేతనంటే మా

మాటలు మాకే వినపడడంలేదు. నేనా సుత్తె తీసుకుని గోడను పగలగొట్ట సాగాను.

అది అంత తేలికపని కాదు, ఏమంటే నేను చెయ్యి మరీ వెనక్కి విసిరితే అతిథులకు దెబ్బ తగులుతుంది. మొట్టమొదట్లో గిలాబు పలచని బెత్తికలుగా ఊడి వచ్చింది. తరవాత కలప పెళ్ళలు పెళ్ళలుగా ఊడి నా పాదాల దగ్గిర ఇసుకా, మొరుమూ రూపంలో పోగుపడసాగింది. నా వెనక పార్టీ మంచి రసపట్టులో పడింది. కాని నేను లక్ష్యపెట్టలేదు. ఆ ఒళ్ళుతెలియని కోలాహలంలో ఎవరో స్త్రీ బూతుపాట పాడడం ఒక మూలనుంచి వినిపించింది. ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్ ఉండగా అలాటిపని జరిగినందుకు మామూలు పరిస్థితిలో అయితే చాలా నొచ్చుకుని ఉందును. ఇప్పుడు నేను స్టూడియోనుంచి తప్పించుకుని పారిపోతున్నాను గనుక అటే పట్టించుకో లేదు. అదేమైనా, ఆ కంఠస్వరం ఫ్రౌ ఫాన్ హెర్గెన్‌రాత్‌దే నని నాకు త్వరలోనే తెలిసిపోయింది. నే నెన్నడూ ఊహించని కళలు ఆమెలో వున్నాయన్నమాట; అరమరలన్నీ తొలగినప్పుడే అవి బయటపడతాయిలాగుంది.

గోడలో గుంట పెద్దదయింది. కొంతసేపయాక అందులో కంత ఏర్పడి, అవతలి గదిలో జరిగేదంతా నాకు కానవచ్చింది. అది నా పొరుగువాళ్ళ పడకగది. వాళ్ళ ఇంటిపేరు గైస్‌లిఫ్. వాళ్ళు నా కిప్పటికీ ఒక విధంగా పొరుగువాళ్ళుగానే వున్నారు. వాళ్ళు ఆధునిక దృక్పథం గలవాళ్ళు, అయినా మర్యాదస్తులు. అయితే ప్రస్తుతం వాళ్ళ రెండో లక్షణం కాస్తా వెనకపడి, మొదటి లక్షణం ముందుకు వచ్చింది. ఆ తప్పు నాదేనని ఒప్పుకోవాలి.

వాళ్ళిద్దరూ పక్కమీద లేచి కూర్చున్నారు; లైటువేసి, అమిత ఆశ్చర్యంతో నన్ను పలకరించారు, కాని అస్నేహభావం లేదు. మీదుమిక్కిలి వాళ్లు నా పట్ల దయతో కూడిన సహనం కనబరిచారు. కళాకారులపట్ల సాటి పౌరులు, ప్రత్యేకించి, ఇలాటి అసాధారణ పరిస్థితులలో, అలాటి వైఖరి చూపడం మహా అరుదు. ఒకవేళ వాళ్ళు, నిద్రాభంగం కలగగానే తమ ఆధునిక దృక్పథం స్మరించారేమో. నా మటుకు నా కెంత బిడియం కలిగిందంటే, నేను వాళ్ళను క్లుప్తంగా పలకరించి, నా మానాన గోడపగలగొట్టి, కంతను ఇప్పుడున్న ప్రమాణానికి తెచ్చాను. తరవాత నేను వారిని పిచ్చిగా, "రావచ్చునా ?" అని అడిగి, వారి సమాధానంకోసం ఆగకుండా కంతలోనుంచి దూరేశాను.

నా భుజాలమీది దుమ్మూ దుట్రా దులిపేసుకుని, "ఇలా వేళగాని వేళ మీకు ఇబ్బంది కలిగించినందుకు క్షమించండి. నేను మిమ్మల్ని పార్టీకి ఆహ్వానింతామని వచ్చాను. ఈ రాత్రి నా స్టూడియోలో పార్టీ ఇస్తున్నాను. సరదా అయిన పార్టీ," అన్నాను.

గైస్‌లిఖ్ దంపతులు ఒకరినొకరు చూసుకున్నారు. అంటే నా ఆహ్వానం పరిగణించ దగినదేనన్నమాట. నా మనసు తేలికపడింది. నేను మరొకసారి ఆహ్వానింతామని అనుకుంటుండగా హెర్ గైస్‌లిఖ్ విశాలంగా నవ్వుతూ జవాబు చెప్పాడు : నా ఆహ్వానానికి తాను కృతజ్ఞుడేగాని, తమలాటి వయసుగల దంపతులు ఎంత ఆధునిక దృక్పథం కలిగినవా రయినప్పటికీ, కళే జీవితలక్ష్యంగా గలవారి మధ్యకు రావడం, అందులోనూ తమకు అలాటి లక్ష్యంలేని సందర్భంలో, ఈ కాలంలో అంత భావ్యమనిపించుకోదేమో. కాని, ఎలాంటివాళ్ళనైనా తమలో ఒకరుగా చేర్చుకోగల నేర్పు అందరికన్నా కళాకారులకు హెచ్చుగా ఉంటుందని నేనన్నాను. ఏమైనా, అవతల నా స్టూడియోలో ఉత్తమ కళాపోషకులు లగాయతు సామాన్యవృత్తుల వాళ్ళదాకా అన్నిరకాలవాళ్ళూ ఉన్నారన్నాను. ఆరాత్రి నాజన్మలో మొట్టమొదటిసారి ఎలాటి వాక్చాతుర్యం కనబరిచానంటే, చివరకు గైస్‌లిఖ్ దంపతులకు పార్టీలో ఆసక్తి పుట్టుకొచ్చింది. వాళ్ళు దుస్తులు మార్చుకోవడానికి ప్రయత్నిస్తే పడుకునే దుస్తులతోనే వెళ్ళమనీ, పార్టీలో అందరూ అతికొద్ది దుస్తులే ధరించి ఉన్నారనీ చెప్పి ఒప్పించాను కూడా. అది పచ్చి అబద్ధమనుకోండి, కాని నేను ఎలాగైనా ఒంటరిగా ఉండాలన్న కోరిక తీవ్రమవుతూవచ్చింది.

వాళ్ళు పక్క దిగారు. హెర్ గైస్‌లిఖ్ చారల పైజామా ధరించి ఉన్నాడు. ఆమె నైట్‌గౌను ధరించి ఉన్నది. అతను ఆమెచేత ఇంట్లోవేసుకునే కోటు ఒకటి ధరింపజేసి, ఆమె డ్రెసింగ్ టేబిల్ అద్దంలో చూసుకుని తల దువ్వుకుంటూంటే, తొందరపడుతున్నట్టుగా గదిలో పచార్లు చేశాడు. అంటే నేను వాళ్ళకు బాగానే పురి ఎక్కించానన్నమాట. నేను తరవాత ఆలోచించాను, నేను వేసిన ఎరలలో ఏది పారిందా అని — కళాకారుల మంచితనమా, ఉత్తమ కళాపోషకు లున్నారన్నదా ? నేను కంతలోనుంచి చూసినప్పు డేమనిపిస్తుందంటే, ఎవరికీ నిండుగా దుస్తులు లేవన్నది పారిందా అనిపిస్తుంది: ఆ మాట అక్షరాలా నిజమవుతున్నది కూడానూ.

మొదట హెర్ గైస్‌లిఖ్ కంతకుండా దూరాడు. వెంటనే అవతల అతనికి నిలబడడానికి చోటు దొరికినట్టున్నది. అతను తన భార్యకు, బండీమెట్లు ఎక్కడానికి సహాయపడే వాడిలాగా, చెయ్యి అందించాడు. నేనుకూడా ఇవతలినుంచి ఒక చెయ్యి వెయ్యవలసి వచ్చింది, ఏమంటే ఫ్రౌ గైస్‌లిఖ్ మొత్త చాలా పెద్దది. ఆవిడకు కూడా అవతల నిలబడే చోటు దొరికింది. నేను ఒంటరిగా ఉండిపోయాను.

నా కున్న బలమంతా ఉపయోగించి బట్టల అలమారును కంతకు అడ్డంగా ఈడ్చాను. అది ఇంకా అక్కడే ఉన్నది. ఇప్పుడు చాలా వరకు ప్రశాంతంగా ఉన్నది. అలమారులో బట్టలు ధ్వనిని చాలాభాగం నిరోధిస్తున్నాయి. లేక అవతల తాత్కాలికంగా సందడి తగ్గిందేమో.

నేను చిత్తుగా అయిపోయి జంటమంచాలలో ఒకదానిమీద కూలబడ్డాను. నా పరిస్థితి గురించి పర్యాలోచన చేసుకోవడానికి ప్రయత్నిస్తే సమీప సంఘటనలను మించి ఆలోచించడానికి శక్తి చాలకపోయింది. నిజానికి ఆ సాయంకాలం చాలా హడావుడయిపోయింది. దూరాన ఇంజను కూసిన చప్పుడు వినిపించింది. పార్టీకోలాహలం అస్పష్టమై, ఇతర ధ్వనులు దానిని మించి వినిపించడం నా కెంత ఆనందం కలిగించిందో నా కింకా జ్ఞాపకం ఉన్నది. కర్టెన్లలో నుంచి బయట వెలుగు జాస్తి కావడం కనిపించింది. అంటే తెల్లవారుతున్నదన్నమాట. ఈ వేళకు నిద్రలేవడం జరిగితే నేను జ్ఞాపకాలనుంచి ముందున్న కష్టాలదాకా అనేక భావాల పరంపరకు గురి అవుతాను. ఇంతలో కోడికూత వినపడింది. అది ఒకటే దానికి గల పని, అందుకే దాన్ని కవులు కీర్తిస్తారు. అసాధారణ పరిస్థితులలో నాకుండే మామూలు ప్రకారం నా భావాలు తమంతట తామే ఏర్పడుతూండడం గమనించాను. అంతలో నిద్రపట్టింది. అపరాహ్ణం ఆలస్యంగా మెలకువ వచ్చింది. కంతలోనుంచి చూశాను. పార్టీ మంచి జోరులో వున్నది. అది శాశ్వతంగా కొనసాగుతుందని నాకు తెలిసిపోయింది.